

సదరంలో.. సర్టిఫికేట్లు



శారీరక లోపం.. మనిషికి శాపం. వైక్యలం ఉండే వారి జీవనం కనాకష్టం. వారు పని చేసుకోవాలనుకున్నా శరీరం సహకరించదు. అలాంటి వారికి సాయంగా ప్రభుత్వం పింఛన్ ఇస్తుంది. అయితే ఈ పింఛన్లకు కక్కుర్తి పడిన కొందరు సదరం సర్టిఫికెట్లు పొందుతున్నారు. వైకల్యం లేకపోయినా ఏదో ఒక లోపం ఉన్నట్లుగా సదరం నుంచి ధ్రువీకరణ చేయించుకుని దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటివి పెద్దఎత్తున చోటుచేసుకున్నట్లు తాజాగా వెలుగుచూస్తున్నాయి. ఎటువంటి వైకల్యం లేకపోయినా వైసీపీకి చెందిన వారు పెద్దసంఖ్యలో పింఛన్లు పొందినట్లు వెలుగుచూస్తోంది. సదరం సర్టిఫికెట్లు జారీలో వైసీపీ నేతల ఆధ్వర్యంలో పెద్ద మాఫియా నడిచినట్లు అర్థమవుతోంది. ఇదే అవకాశంగా సదరం సర్టిఫికెట్లును నగదుకు కూడా కొందరు అమ్ముకున్నట్లు తెలుస్తోంది. దీంతో అసలైన లబ్ధిదారులు దివ్యాంగ పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వంలో ఇటీవల పింఛన్ల పంపిణీ సమయంలో దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్న వారిని చూసి ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఆశ్చర్యపోయారంటే సదరం ఏ స్థాయిలో దుర్వినియోగం చేశారో తెలుసుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో నకిలీ సదరం సర్టిఫికేటుగాళ్ల పని పట్టాలని పలువురు కోరుతున్నారు.

- వైకల్యం లేకపోయినా సర్టిఫికెట్
- దర్జాగా పింఛను అందుకుంటున్న అనర్హులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో భారీగా ధ్రువీకరణలు
- కూటమి ప్రభుత్వం రాకతో వెలుగులోకి నకిలీ లబ్ధిదారులు





గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో దివ్యాంగ పింఛన్ల పరిస్థితి. అనర్హులు ఏళ్ల తరబడి దర్జాగా పింఛన్లు కాజేస్తుంటే, అర్హులు పింఛన్లు దొరక్క నానా అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్న వారు వేలల్లో ఉంటే బాధితులు ఎందరో తమకు పింఛన్లు అందడంలేదని తిరగడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఐదేళ్లుగా అటు పాలకులు, ఇటు అధికారులు వారిని కరుణించలేదు. ఎలాంటి వైకల్యం లేకపోయినా సదరం సర్టిఫికెట్లు తీసుకుని వేలాది మంది దివ్యాంగుల పింఛన్లు కైంకర్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏ పనీ చేసుకోలేని దీన స్థితిలో ఉండే దివ్యాంగులు మాత్రం తమకు పింఛను అందజేసి పుణ్యం కట్టుకోవాలంటూ కనిపించిన ప్రతీ అధికారికీ మొక్కుకుంటున్నారు.

వైసీపీ నేతలకే సదరం

వైసీపీ ప్రభుత్వ హయాంలో సదరం సర్టిఫికెట్లు అనేకం దుర్వినియోగం అయ్యాయి. వైకల్యం కారణంగా పనిచేసుకోలేనివారికి ప్రభుత్వం తరఫున చేయూతను అందించడానికి ప్రభుత్వం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తుంటుంది. ప్రభుత్వ వైద్యులు పరీక్షించి దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. సాధారణంగా 40 శాతానికి మించి వైకల్యం ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతుంటారు. కాగా ఈ ప్రక్రియను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ శాఖలన్నీ అప్పటి అధికారపార్టీ సేవకే పరిమితమయ్యాయి. అందులో భాగంగా సదరం సర్టిఫికెట్లలో ఎక్కువభాగం వారికే దక్కాయి. వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులకు కుడి భుజాలుగా ఉన్న గ్రామ స్థాయి నాయకులు, వారి కుటుంబసభ్యులు సదరం సర్టిఫికెట్లతో లబ్ధి పొందారు. చాలా చోట్ల వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు కౌన్సిలర్లు, మెంబర్లు, వారి బంధువులు, మిత్రులు, వారి అనుచరులు భారీ సంఖ్యలో సదరం సర్టిఫికెట్లు కాజేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్లో స్లాట్లు బుక్ చేసుకోవడం, సదరం సర్టిఫికెట్ మాఫియాకి రూ.10 వేలు ఇస్తే వారి పని పూర్తవుతుంది. ఆ తరువాత తతంగమంతా ఆ మాఫియా చూసుకుంటుంది. పరీక్షించే వైద్యులను, ఇతర సిబ్బందిని వారే మెయింటెయిన్ చేసి సదరు వైసీపీ అనుయాయులకు సర్టిఫికెట్లు అందిస్తారు. ఆ వెంటనే తమ పార్టీ పెద్దల సిఫారసుతో వారంతా దరఖాస్తు చేసుకుని పింఛన్లు పొందుతున్నారు.

- పిడుగురాళ్ల మండలం వైరాపురానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థోపెడిక్ వైకల్యం 84 శాతం ఉన్నట్లు సర్టిఫికెట్ తీసుకుని మూడేళ్లుగా దివ్యాంగ పింఛను తీసుకుంటున్నాడు. అయితే అతడికి ఎటువంటి వైకల్యం లేదు. అతడు వైసీపీ నేత కావడంతో సదరం సర్టిఫికెట్ తీసుకుని ప్రభుత్వం నుంచి పింఛను అందుకుంటున్నాడు. చెన్నాయపాలెంలో మరో ఇద్దరు ఇలాగే దివ్యాంగుల పేరిట పింఛను కాజేస్తున్నారు.

- ప్రతి రోజూ ఎమ్మెల్యేల వద్దకు పదుల సంఖ్యలో పింఛను దరఖాస్తులు వస్తున్నాయి. వాటిలో మూడోవంతు దివ్యాంగుల పింఛన్లకు సంబంధించినవే. తీవ్ర వైకల్యంతో బాధ పడుతున్నవారే అత్యధికంగా ఉన్నారు. కానీ ఈరోజు వరకూ వారికి సదరం సర్టిఫికెట్లు దొరకలేదు. పింఛను వరం వరించలేదు.



- గుంటూరు జిల్లాలో ఓ ఎమ్మెల్యే దివ్యాంగ మహిళకు రూ.6వేలు పింఛను అందజేశారు. అయితే ఆమెను చూసిన ఎమ్మెల్యే, ఇతర నాయకులు, జిల్లా అధికారులు ఆశ్చర్యపోయారు. ఆమెకు ఎలాంటి వైకల్యం లేదు. కన్ను, కాలు అన్నీ బాగానే ఉన్నాయి. ఆర్థికంగా అత్యంత స్థితిమంతురాలు. అయినా ఆమె గత కొన్నేళ్లుగా దివ్యాంగుల కోటా పింఛను తీసుకుంటోంది. ఈ పరిణామం చూసి విస్తుపోవడం ఎమ్మెల్యే వంతైంది.

19 వేలు నకిలీ పింఛనుదారులు?

తాజాగా వెలుగు చూస్తున్న అంశాలను బట్టి ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లాలో భాగమైన చీరాలతో కలిపి మూడు జిల్లాల్లో దాదాపు 19వేల వరకూ నకిలీ దివ్యాంగ పింఛన్లు ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. తాజా పింఛన్ల పంపిణీ సందర్భంగా ఒక్కో ఊరిలో 10 నుంచి 15 దివ్యాంగ పింఛన్లు ఉంటే వాటిలో సగం అనర్హులవేనని సచివాలయ సిబ్బంది గుర్తించారు. విభజిత గుంటూరు జిల్లాలో 25,488 దివ్యాంగ పింఛనుదారులున్నారు. వారికి ఈ నెల 15.29 కోట్లు ప్రభుత్వం అందజేసింది. కానీ 6 వేల మంది పింఛనుదారులు అనర్హులని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 35,895 మంది దివ్యాంగ పింఛనుదారులు ఉండగా వారికి ఈ నెల 21.537 కోట్లు ప్రభుత్వం పింఛను కింద ఇచ్చింది. వీరిలో మరో 8వేల మంది వరకూ అనర్హులు ఉండవచ్చని ప్రాథమిక అంచనా. కాగా బాపట్ల జిల్లాలో 20 వేల మంది పింఛనుదారులు ఉన్నారు. వారిలో 5 వేల మంది వరకూ అనర్హులు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని పరిశీలించి, అనర్హులను తొలగించి, అర్హులకు పింఛన్లు జారీ చేయాలి.



సాగు.. 6 శాతమే

- జలాశయాల్లో నీటి నిల్వ వివరాలు (టీఎంసీలలో)..

జలాశయం	నీటి సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
ఆల్మట్టి	129.72	78.61
నారాయణ్‌పూర్	37.64	25.06
జూరాల	9.66	7.72
తుంగభద్ర	100.86	25.17
శ్రీశైలం	215.81	36.66
నాగార్జునసాగర్	312.05	120.74
పులిచింతల	45.77	0.45

- 13 మండలాల్లో వర్షాభావం
- పత్తి మినహా సాగవ్వని ఇతర పంటలు
- తప్పుతోన్న అదును.. ఆందోళనలో అన్నదాతలు

నరసరావుపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): వరుణుడు మురిపిస్తున్నాడు. మాయమవుతున్నాడు. వర్షాలకు డోకా ఉండదు.. కరువుతీరా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ గతంలోనే ప్రకటించింది. అయితే అందుకు విరుద్ధమైన పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. జిల్లాలోని 13 మండలాల్లో వర్షాభావం నెలకొంది. జిల్లా పంటల సాగు సాధారణ విస్తీర్ణం 4,31,165 ఎకరాలు. కాగా ఇప్పటి వరకు 27,150 ఎకరాల్లో అంటే మొత్తం విస్తీర్ణంలో ఆరు శాతం మాత్రమే పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. పొలాలను సిద్ధం చేసిన రైతులు విత్తనం విత్తేందుకు వర్షాలు కురవక ఆందోళన చెందుతున్నారు. అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయే తప్ప సాగుకు అనుకూలంగా వర్షాలు లేవు. సాగుకు గడ్డుకాలం నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు సాగుచేశారు. జిల్లాలో సాగు దారుణంగా పడిపోయింది. పత్తి మాత్రమే స్వల్పంగా సాగు చేశారు. పత్తి సాధారణ విస్తీర్ణం 2,67,965 ఎకరాలు కాగా ఇప్పటివరకు 26,690 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అంటే సాధారణ విస్తీర్ణంలో పత్తి 10 శాతమే సాగైంది. మొలకెత్తిన పత్తి కి కూడా సరపడా వర్షాలు లేక పోవడంతో బెట్టకు వస్తున్నాయి.

వర్షాభావం నెలకొన్న మండలాలు..

జిల్లాలో 28 మండలాలకు మూడు మండలాల్లో తీవ్రమైన వర్షాభావం, 10 మండలాల్లో వర్షాభావం నెలకొంది. నూజెండ్ల మండలంలో 73.9, వినుకొండలో 62.9, ఈపూరులో 60.7 శాతం లోటు వర్షపాతం నమోదైంది. బొల్లాపల్లి, ముప్పాళ్ల, రొంపిచర్ల, సత్తెనపల్లి, నకరికల్లు, నరసరావుపేట, యడ్లపాడు, శావల్యాపురం, అమరావతి గురజాల మండలాల్లో 14 నుంచి 51 శాతం లోటు వర్షపాతం నెలకొంది.

జలాశయాలు వెలవెల

కృష్ణానది పరివాహక ప్రాంతంలో వర్షాలు కురవడంలేదు. జలాశయాల్లో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 589.67 టీఎంసీలు కాగా ప్రస్తుతం 164.72 (27.93 శాతం) టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు జలవనరుల శాఖ ప్రకటించింది. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల్లో కూడా నీటి నిల్వలు ఆశాజనకంగా లేవు. 51.51 టీఎంసీల నీటి నిల్వ చేరితేనే ఆల్మట్టి నుంచి దిగువకు నీటిని విడుదల చేసే పరిస్థితి. శ్రీశైలం జలాశయం ఎగువున ఉన్న డ్యామ్‌లలో వరద ప్రవాహం ఉంది. ఆల్మట్టి జలాశయానికి 84,645 క్యూసెక్కులు, తుంగభద్రకు 27,544 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం ఎగువున ఉన్న అన్ని జలాశయాలు నిండి దిగువకు నీరు విడుదల కావాలంటే సుమారు 130 టీఎంసీల నీరు చేరుకోవాలి. సాగర్‌లో గత ఏడాది కంటే 24.77 టీఎంసీల నీటి నిల్వలు తక్కువగా ఉండటం గమనార్హం. వరుణుడు కరుణించి జలాశయాలు నిండాలని, సాగు నీరు విడుదల కావాలని రైతులు వేడుకుంటున్నారు.

ఇసుక.. చౌకగా

- నిర్మాణదారుడికి భారీ ఊరట
- నామమాత్రంగా సీనరేజ, రవాణా చార్జీలు
- నాడు లారీ ఇసుక రూ.50 వేలు.. నేడు రూ.10 వేలు
- గతంలో నిలిపిన భవన నిర్మాణాలకు తాజాగా శ్రీకారం

- ఓ సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలనుకున్నాడు. అందుకోసం దాదాపు 5 లారీల ఇసుక అవసరం అవుతుందని తెలిసింది. ఒక్కో లారీకి రూ.40 వేల నుంచి రూ.50 వేలు చెల్లించాల్సి ఉందని, ఆ ప్రకారం కేవలం ఇసుక కోసమే రూ.2.50 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని అంచనా వేసుకున్నాడు. డబ్బంతా ఇసుకకే ఖర్చవుతుందని, ఇటుక, ఇనుము, కలప, కూలీలకు డబ్బు లేకుండా పోతుందని భావించాడు. దీంతో అతడి సొంతింటి కల అర్థాంతరంగా ఆగిపోయింది.
  - ఇది నాటి వైసీపీ పాలనలో పరిస్థితి

- అదే సామాన్యుడు ఇప్పుడు తన ఇంటి నిర్మాణానికి కావాల్సిన 5 లారీల ఇసుకకు రూ.50 వేలు మాత్రమే ఖర్చు చేయనున్నాడు. గతంలో ఒక లారీకి పెట్టే ఖర్చుతో ఇప్పుడు ఐదు లారీల ఇసుక వస్తుందని అతడు అంచనా వేసుకున్నాడు. ఒక్క ఇసుకలోనే రూ.2 లక్షల ఖర్చు తగ్గనున్నదని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.
  - ఇది ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పరిస్థితి

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనకు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు ఇసుక విషయంలో మార్పు రావడంతో సామాన్యుడి సొంతింటి కల ఇంకెంతో దూరంలో లేదని స్పష్టమవుతుంది. వైసీపీ హయాంలో రూ.50 వేలు ఇచ్చినా దొరకని ఇసుక ఈ రోజు పదివేలకే వస్తుంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అంతకముందు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత విధానాన్ని రద్దు చేసింది. కొత్త పాలసీ తీసుకు వస్తామని నాటి సీఎం జగన్ దాదాపు 8 నెలలు ఇసుక అందకుండా చేశారు. ఆ తర్వాత ఇసుక పాలసీ తెచ్చినా సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పైగా వారిని ఇసుక పేరుతో వైసీపీ నాయకులు నిలువు దోపిడీ చేశారు. లారీ ఇసుక రూ.25 నుంచి 40వేల వరకూ వెళ్లింది. బ్లాక్ మార్కెట్, ఇసుక మాఫియా పుణ్యమా అని రూ.50 వేలు కూడా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ట్రాక్టరు ఇసుక కనీసంగా రూ.5 వేలు, గరిష్ఠంగా 10 వేల వరకూ వెళ్లింది. దీంతో నిర్మాణరంగం కుదేలైంది. కూలీలు పనులు లేక అల్లాడిపోయారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో లారీ ఇసుక రవాణా చార్జీలతో కలిపి రూ.9 నుంచి 10 వేలకే తన గుమ్మంలోకి వస్తోందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.2 వేలకే వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టన్ను ఇసుకకు రూ.2000 నుంచి 2500 వరకూ ఖర్చు చేయాల్సిరాగా, ఇప్పుడు అది కేవలం రూ.265కే వస్తోంది. టన్ను ఇసుకకు సీనరేజి కింద రూ.88 చెల్లించాలి. ఇసుక తవ్వినందుకు కాంట్రాక్టు సంస్థలకు టన్నుకు రూ.30 చెల్లించాలి. నిర్వహణ వ్యయం కింద రూ.20 చెల్లించాలి. రీచ్ నుంచి స్టాక్ పాయింట్లకు ఇసుక తరలింపునకు కిలో మీటరుకు రూ.4.90 రవాణా చార్జీగా నిర్ణయించారు. అదే ఇసుకను వినియోగదారుడు రీచ్ నుంచి తెచ్చుకుంటే రూ.4.90 చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆ మొత్తానికి వినియోగదారు 18 శాతం జీఎస్టీ చెల్లించాలి.

పనులకు శ్రీకారం.. కూలీలకు ఉపాధి

వైసీపీ హయాంలో ఇసుక కారణంగా నిర్మాణదారుల కష్టాలు, ఉపాధి కోల్పోయి కూలీలు పడిన ఆర్థిక బాధలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని అమలు చేశారు. తొలి రెండు మూడు రోజుల్లోనే లక్షలాది మెట్రిక్ టన్నుల ఇసుక జన సామాన్యానికి అందుబాటులోకి వచ్చింది. సామాన్యులు ఇప్పటి వరకు ఆపేసుకున్న నిర్మాణాలకు తిరిగి శ్రీకారం చుట్టారు. కూలీలు, మేస్త్రీలు పనుల్లో బిజీగా మారారు. గత ప్రభుత్వ హయాంలో టన్ను ఇసుక రూ.2 వేల నుంచి రెండున్నర వేలు ఉండగా అది ఇప్పుడు 265 రూపాయలకే సామాన్యుల గడప వద్దకు వచ్చి పడుతోంది.

ఓర్వలేక విష ప్రచారం..

ప్రస్తుత ఇసుక పాలసీకి వస్తున్న అనూహ్య స్పందనను చూసి ఓర్వలేని వైసీపీ విష ప్రచారానికి తెరతీసింది. తప్పుడు కథనాలు, వ్యాఖ్యానాలతో సామాజిక మాధ్యమాల ద్వారా విషం చిమ్ముతోంది. స్థానిక సంస్థలకు చెల్లించే సీనరేజిని, ఇసుక రవాణా నిమిత్తం అయ్యే ఖర్చులను ఆసరా చేసుకుని దారుణమైన తప్పుడు ప్రచారానికి వైసీపీ తెగబడుతోంది. వైసీపీ విష ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడంలేదు. వైసీపీ హయాంలో రూ.50 వేలకు లారీ ఇసుక కొన్నవాళ్లు, భారం మోయలేక పనులు ఆపేసుకున్నవాళ్లు అధికంగా ఉండడంతో వైసీపీ దుష్ప్రచారాన్ని వారే తిప్పికొడుతున్నారు.



ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందాలి

- రెండు రోజుల్లో వస్తా.. పారిశుధ్యం మెరుగవ్వాలి
- డయేరియా ప్రాంతాల్లో మంత్రి నారాయణ పర్యటన
- లెనిన్‌నగర్ ఆస్పత్రిలో బాధితులకు మంత్రి పరామర్శ

పిడుగురాళ్ల, జూలై 11: పిడుగురాళ్లలో డయేరియా సోకిన ప్రతిఒక్కరికి మెరుగైన వైద్యం అందాలి. అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. పట్టణంలో మెరుగైన పారిశుధ్యం కనిపించాలి. రెండు రోజుల్లో మళ్లీ వస్తాను. పారిశుధ్యం ఎలా ఉందో పరిశీలిస్తా.. అని మంత్రి నారాయణ అధికారులకు తెలిపారు. తొలుత లెనిన్‌నగర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి రోజువారి ఎంత మంది డయేరియా లక్షణాలతో నమోదవుతున్నారని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డయేరియా ప్రభావిత లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాల్లో గురువారం మంత్రి పర్యటించారు. గత నెల 29న గోవిందాపురం నుంచి పిడుగురాళ్లకు సరఫరా అయ్యే మంచినీటి పైపునకు లీకేజితో బోరు నీటినే కొందరు వాడుతున్నారని ఆ కారణంగానే పలువురు డయేరియాకు గురైనట్లు అనుమానిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధితుల వివరాలను తెలుసుకోవడంతో పాటు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తగు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎప్పటికప్పుడు డయేరియా వివరాలు తనకు తెలిపారన్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి..

వర్షాకాలం సమీపిస్తున్నందున ముందస్తుగా కాల్వల పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎల్లుండిలోగా పనులు పూర్తిచేయాలన్నారు. నీరు కలుషితమైనట్లుగా భావిస్తున్న లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాల్లో నీటి శాంపిల్స్ సేకరించాలని విజయవాడ ల్యాబ్ అధికారులకు మంత్రి నారాయణ ఫోన్ చేసి ఆదేశించారు. డయేరియా ప్రబలేందుకు గల కారణాలను అధికారులనడిగి మంత్రి తెలుసుకున్నారు. మంత్రి వెంట ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి రవి, కమిషనర్ గిరికుమార్, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, ఏఈ రాఘవేంద్ర, తహసీల్దార్ శ్యాంసుందరరాజా, డీటీ సరోజ, ఎమ్మెల్యే తనయుడు సాయినిఖిల్, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పాండురంగ శ్రీను, కనిగిరి శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, మల్లెల ఆదినారాయణ, తురకా వీరస్వామి, ఎల్‌వీఆర్, బత్తుల శ్రీను, మస్తాన్‌వలి, కార్ సైదా, చిలకా చిన్న, పణితి రవి, పిల్లి చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు.



వైద్యశాలలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ



లెనిన్‌నగర్ వైద్యశాలలో డయేరియా బాధితుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

హరే కృష్ణ.. హరే రామ్

- మంగళగిరిలో వైభవంగా జగన్నాథ రథయాత్ర
- రథయాత్రను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, జూలై 11: ఇస్కాన్ ఆధ్వర్యంలో మంగళగిరిలో శ్రీ జగన్నాథుని రథయాత్ర గురువారం అత్యంత వైభవంగా సాగింది. జై జగన్నాథ్, హరేకృష్ణ, హరేరామ్ నినాదాలతో మంగళగిరి పురవీధులు మార్మోగాయి. తొలుత జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలకు హారతులిచ్చిన మంత్రి లోకేశ్... అనంతరం రథాన్ని లాగి రథయాత్రను ప్రారంభించారు. రథానికి ముందు సంప్రదాయబద్ధంగా బంగారు చీపురుతో రహదారి మార్గాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ప్రజా సేవ అంటే పరమాత్ముడి సేవ అన్నారు. ఇప్పుడు అందరి దృష్టి మంగళగిరి వైపే ఉందని, ఆ దేవుడి ఆశీస్సులతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు. మంగళగిరి నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మంగళగిరి బస్టాండు నుంచి బైపాస్ రోడ్డులోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయం వరకు రథయాత్ర సాగింది. దారిపొడవునా జగన్నాథ రథం ముందు భక్తులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు ఒడిశాలోని పిప్లి నుంచి తెప్పించిన రంగుల పందిరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోలాట ప్రదర్శనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, బాపూజీ అకాడమీ చైర్మన్ యర్రాకుల తులసీరామ్, పిరమిడ్ ధ్యాన మండలి అధ్యక్షుడు ఆకురాతి శంకరరావు, బలరామ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లెబాట రాజా, సువర్ణ శ్రీనివాస దాస్, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలకు హారతి ఇస్తున్న మంత్రి నారా లోకేశ్

దిక్సూచి DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.



- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు - 522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఇగ్నోలో ఓడీఎల్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అడ్వాన్స్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పవర్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అప్రిసియేషన్ కోర్సు: కోర్సు వ్యవధి మూడు నెలలు.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్, క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్, డెయిరీ టెక్నాలజీ, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఫ్యాషన్ డిజైన్ అండ్ రిటైల్, హార్టికల్చర్, మీట్ టెక్నాలజీ, మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్, న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పారాలీగల్ ప్రాక్టీస్, థియేటర్ ఆర్ట్స్, టూరిజం స్టడీస్, ఉర్దూ, వాల్యూ ఎడ్యుకేషన్, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, అగ్రికల్చరల్ అండ్ కాస్ట్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మర్చండైజింగ్, రిటైలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీఏ, బీఏ ఆనర్స్, బీటీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్ బీకాం, బీఎస్‌డబ్ల్యూ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ వ్యవధి ఏడాది.

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంటీటీఎం, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంఎల్ఐఎస్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అనలిటికల్ కెమిస్ట్రీ, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, గాంధీ అండ్ పీస్ స్టడీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, యానిమల్ వెల్ఫేర్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఆడియో ప్రోగ్రామ్ ప్రొడక్షన్, బుక్ పబ్లిషింగ్, కార్పొరేట్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. అగ్రికల్చర్ పాలసీ, క్లయిమేట్ ఛేంజ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్వెంటరీ ప్లానింగ్ అండ్ వేర్ హౌసింగ్ సిస్టమ్ ఫర్ ఇంజనీర్స్, మలయాళం-హిందీ ట్రాన్స్‌లేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** ignouadmission.samarth.edu.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమాలు

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. మహిళలకు ప్రోగ్రామ్ ఫీజులో పది శాతం రాయితీ లభిస్తుంది. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసే అభ్యర్థుల కోసం 25 శాతం సీట్లు కేటాయించారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించి కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి ఏడాది. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, దుర్గాపూర్, అలప్పుజా, శివ్‌పురి సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఒక్కో సెంటర్లో 60 సీట్లు చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ హైడ్రో పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి తొమ్మిది నెలలు. నంగల్ సెంటర్లో ఈ ప్రోగ్రామ్ ఉంది. ఇక్కడ 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: కోర్సు వ్యవధి ఏడాది. న్యూఢిల్లీ, శివ్‌పురి, నైవేలీ, అలప్పుజా సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ కోర్సుకు ఏ ఇంజనీరింగ్ విభాగంవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **టెలిఫోనిక్ ఇంటర్వ్యూ:** జూలై 30, 31
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 5, 6
- **కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.npti.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/V9yZi4uలో చదవండి.

సెప్టెంబర్ ఒకటిన బాలకృష్ణకు భారీ సన్మానం



'తాతమ్మ కల' (1974) చిత్రంతో తన నట జీవితాన్ని ప్రారంభించారు నందమూరి బాలకృష్ణ. వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ 50 ఏళ్లుగా హీరోగా కొనసాగుతున్న ఏకైక కళాకారుడు ప్రపంచంలో ఆయన ఒక్కరే అంటే అది అతిశయోక్తి కాదు. అంతేకాదు తండ్రి, మహానటుడు ఎన్టీఆర్ మార్గాన్ని అనుసరించి రాజకీయాల్లోకి ప్రవేశించి హిందూపురం నియోజక వర్గం నుంచి మూడు సార్లు వరుసగా శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఇలా సినీరంగంలోనూ, రాజకీయ రంగంలోనూ సత్తా చాటుతూ 50 ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న బాలకృష్ణను తెలుగు చిత్రపరిశ్రమ సెప్టెంబర్ ఒకటిన ఘనంగా సత్కరించనుంది. ఈ మేరకు తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కలవగా, బాలకృష్ణ ఈ సన్మానానికి తన అంగీకారం తెలిపారు. బాలీవుడ్, ఇతర సినీ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ సన్మాన సభకు హాజరవుతారని సమాచారం.

షూటింగ్ మొదలుపెట్టారు



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ గురువారం మొదలైంది. వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఓ పోలీస్ ఆఫీసర్, ఆయన భార్య, మాజీ ప్రేయసి.. ఇలా మూడు పాత్రల చుట్టూ తిరిగే వినోద భరిత చిత్రమిదని, ఇందులో క్రైమ్ ఎలిమెంట్ కూడా మిళితమై ఉంటుందని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభమైన షూటింగ్‌లో చిత్రంలోని ముఖ్య తారాగణమంతా పాల్గొంటోంది. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత శిరీష్ చెప్పారు. దిల్ రాజు ఈ సినిమాకు సమర్పకుడు. ఈ చిత్రానికి సమీర్‌రెడ్డి ఛాయాగ్రాహకుడు, భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడు.

ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్ ఉత్తమ నటిగా సాయి పల్లవి

ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డుల సందడి





జాతీయ చలనచిత్ర అవార్డుల తర్వాత భారతీయ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డులను గురువారం ప్రకటించారు. అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు పొందిన 'ఆర్ ఆర్ ఆర్' చిత్రం తెలుగు విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి ఎన్నికయ్యారు. 'విరాటపర్వం' చిత్రంలో నటించిన సాయిపల్లవి ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. 'భీమ్లా నాయక్'లో నటించిన రానా ఉత్తమ సహాయ నటుడిగా, 'విరాటపర్వం'లో నటించిన నందితా దాస్, 'సీతారామం'లో నటించిన మృణాల్ ఠాకూర్ ఉత్తమ సహాయ నటీమణులుగా, ఉత్తమ గేయ రచయితగా సీతారామశాస్త్రి (సీతారామం) ఎన్నికయ్యారు. తమిళంలో ఉత్తమ నటుడిగా కమల్ హాసన్ (విక్రమ్) ఉత్తమ నటిగా ఊర్వశి, ఉత్తమ చిత్రంగా 'పొన్నియిన్ సెల్వం 1', ఆ సినిమాకు దర్శకత్వం వహించిన మణిరత్నం ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. కన్నడంలో 'కాంతార', మలయాళంలో 'న్నా థాన్ కేసు కుడు' ఉత్తమ చిత్రాలుగా ఎన్నికయ్యాయి.

వినోదాత్మకంగా డార్లింగ్



అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డార్లింగ్'. ప్రియదర్శి, నభానటేశ్ జంటగా నటించగా, కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌రామ్ మీడియాతో ముచ్చటించారు. "కొత్త జంట పెళ్లిని ఎలా హ్యాండిల్ చేస్తారనేది ఇందులో వినోదాత్మకంగా చూపించా. సినిమాల ద్వారా సందేశాలు ఇవ్వడం నాకు ఇష్టం ఉండదు. ఈ సినిమాలో ఎంటర్టైన్‌మెంట్‌తో పాటూ ఓ సామాజిక బాధ్యతను కూడా జత చేశా. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. అలా ఆ పాత్రలకి సరిపోయే నటీనటులను పరిశీలించాక.. ప్రియదర్శి, నభానటేశ్ వందశాతం సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. నభా పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి.. సినిమాలో నభా మీ అందరినీ పూర్తిగా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

అద్భుతమైన విజువల్స్‌తో..



వరుణ్ సందేశ్ నటిస్తున్న చిత్రం 'విరాజీ'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్‌ను దర్శకుడు సాయి రాజేశ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్‌లో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. వరుణ్ లుక్ అదిరిపోయింది" అని చెప్పారు. "ఈ చిత్రం నాకు చాలా స్పెషల్" అని వరుణ్ సందేశ్ అన్నారు. "ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. వాటిని థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు" అని దర్శకుడు ఆద్యంత్ హర్ష తెలిపారు.

ముందు రిసెప్షన్.. తర్వాత పెళ్లి!



వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ మంచి నటిగా తెలుగువారికి దగ్గరైన తమిళ నటి వరలక్ష్మి తన పెళ్లి వేడుకలోనూ వైవిధ్యం చూపించారు. వారం రోజుల క్రితం చెన్నైలో వరలక్ష్మి, నికోలై సచిదేవ్‌ల పెళ్లి రిసెప్షన్ చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు పలువురు చిత్ర ప్రముఖులు హాజరయ్యారు. ఇలా అందరి అభినందనలు అందుకున్న వరలక్ష్మి, నికోలై సచిదేవ్ మంగళవారం థాయ్‌లాండ్‌లోని క్రాబి బీచ్ రిసార్ట్‌లో పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అతికొద్దిమంది సన్నిహితుల మధ్య తమిళ సంప్రదాయానికి అనుగుణంగా ఈ పెళ్లి జరిగింది.

అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సంచలనం



సత్యం రాజేశ్, బాలాదిత్య, గెటప్ శ్రీను ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'పొలిమేర 2' బాక్సాఫీస్ వద్ద ఊహించని సక్సెస్‌ను అందుకుని హారర్ థ్రిల్లర్ జానర్ సినిమాల్లో సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 2021లో 'మా ఊరి పొలిమేర' చిత్రం ఓటీటీ సంస్థ 'డిస్నీ ప్లస్ హాట్‌స్టార్'లో విడుదలై అందరినీ మెప్పించింది .'మా ఊరి పొలిమేర'కు సీక్వెల్‌గా వచ్చిందే 'పొలిమేర 2'. గతేడాది నవంబరులో విడుదలైన ఈ సక్సెస్‌ఫుల్ హారర్ థ్రిల్లర్ ఫిల్మ్‌కు కొనసాగింపుగా ఇంకో భాగం ఉంటుందని మేకర్స్ అప్పుడే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించారు. తాజాగా, 'పొలిమేర 3'ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియో రిలీజైన కొద్దిసేపటికే ఎక్స్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ టాప్ ప్లేస్‌ను ఆక్రమించింది. మూడో భాగాన్ని మొదటి రెండు పార్టులకు దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించనున్నారు. భోగేంద్ర గుప్తా, వంశీ నందిపాటి సంయుక్తంగా నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'పొలిమేర 3' లో సత్యం రాజేష్, బాలాదిత్య కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు.

ఏఎన్‌యూ డిగ్రీ 4వ సెమిస్టర్
పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, జూలై 11 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏప్రిల్ లో నిర్వహించిన డిగ్రి నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఫలితాలను గురువారం తాత్కాలిక రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదనపు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ బీకాం, బీఎస్సీ, బీఏ, బీసీఏ, బీబీఏ, బీఏవోఎల్ కోర్సుల ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రీ వాల్యూయేషన్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1240 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పరీక్షలకు 14,544 మంది హాజరు కాగా 8439 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు రెడ్డి ప్రకాష్ వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీ.సత్యనారాయణ, డాక్టర్ సుధాకర్, డాక్టర్ భబిత తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ ప్రజా దర్బార్‌కు అనూహ్య స్పందన

● 16వ రోజు భారీగా తరలివచ్చిన ప్రజలు
● బాధితులకు భరోసా ఇస్తున్న మంత్రి లోకేశ్
● సమస్యలను మెయిల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి



దివ్యాంగుడి నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న నారా లోకేశ్

తాడేపల్లి, జూలై 11: సామాన్య ప్రజానీకం పడుతున్న కష్టాలు వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. ఉండవల్లి నివాసంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు మంగళగిరి నియోజకవర్గం నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు తరలిరావడంతో ఉండవల్లి కరకట్ట అర్జీదారులతో నిండిపోయింది. లోకేశ్ ప్రతి ఒక్కరి కష్టాన్ని వింటూ వారికి భరోసానిస్తూ అర్జీలను సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపుతున్నారు.

వైసీపీ రేషన్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- మంగళగిరి నియోజకవర్గంలో రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్న వైసీపీ నేతలు,సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పీ.నాగ సురేష్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. పలువురు అధికారులు ఎండీఏ ఆపరేటర్లను మేనేజ్ చేస్తూ రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్నారని విచారిస్తే విషయాలు వెలుగులోకి వస్తాయని కోరారు.
- సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని మంగళగిరికి చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పలువురు లోకేశ్‌ను కోరారు.
- ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రేషన్ కార్డుతో పాటు పెన్షన్ ఆరోగ్యశ్రీ సదుపాయాలు కల్పించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా గ్రామీణాభివృద్ధి, సెర్ప్ సంస్థల్లో పని చేస్తున్న మండల వ్యవసాయ నిపుణులను కొనసాగించాలని ఆశాఖ సిబ్బంది కోరారు.
- ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం ప్రాథమిక పాఠశాలను కాపాడాలని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్రంలో కూటమి అఖండ విజయం సాధించడంపై యర్రబాలెం గ్రామానికి చెందిన మహిళా రైతులు మాజీ జడ్పీటీసీ ఆకుల జయసత్య నేతృత్వంలో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకుని అనంతరం ఉండవల్లిలో నారా లోకేశ్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

సమస్యలను పర్సనల్ మెయిల్ ఐడీకి పంపండి : మంత్రి లోకేశ్

ప్రజల నుంచి వరదలా వచ్చిన మెసేజ్‌లతో సాంకేతిక సమస్య తలెత్తిన కారణంగా తన వాట్సాప్‌ను మెటా బ్లాక్ చేసిందని, దయచేసి సమస్యలు వాట్సాప్ చేయవద్దని మంత్రి లోకేశ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమస్య ఏదైనా సహాయం కావాలన్నా ఇక నుంచి తన పర్సనల్ మెయిల్ ఐడీ hello.lokesh@apgov.in కు పంపాలని విజ్ఞప్తి చేశారు. పేరు, ఊరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సమస్య సహాయానికి సంబంధించిన పూర్తి వివరాలు వినతులతో పొందుపరిచి మెయిల్ చేయాలని కోరారు. అనంతరం ఆయా సమస్యకు సహాయం చేయడం, పరిష్కారం చూపటం వంటి బాధ్యత తాను తీసుకుంటానని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

వందేభారత్‌కు పిడుగురాళ్లలో స్టాపేజీ కల్పించాలి

● దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి



దక్షిణ మధ్య రైల్వే జీఎంతో చర్చిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కి పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో నిలుపుదల సౌకర్యం కల్పించాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కి విజ్ఞప్తి చేశారు. అలాగే విజయవాడ నుంచి బెంగుళూరు వరకు నరసరావుపేట, వినుకొండలో స్టాప్‌లతో కొత్త వందేభారత్ రైలుని ప్రారంభించాలని కోరారు. గురువారం రైల్వే సమస్యలు పరిష్కారం కోరుతూ హైదరాబాదులోని రైల్ నిలయంలో పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రుణ్‌కుమార్ జైన్‌కు అందజేశారు. పల్నాడు ప్రజలకు మేలు కలిగేలా పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో పల్నాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపేజ్‌ని ఇవ్వాలని, సత్తెనపల్లి స్టేషన్‌లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు నిలుపుదల కల్పించాలని, విశాఖపట్నం నుంచి గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేసారు. పేరేచర్ల నుంచి గన్నవరం/పెదవుటపల్లికి కొత్త ఎంఎంటీఎస్ రైలు సేవలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పల్నాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ విజయవంతంగా 25 సంవత్సరాల సేవలను పూర్తి చేసుకుందని, ప్రస్తుతం ఉన్న బోగీలను వందే భారత్ రైళ్ల ప్రమాణాలతో మార్చాలని కోరారు. కొత్త జిల్లా పల్నాడులో ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని, కొత్తవి మంజూరుచేయాలని కోరారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, వినుకొండ, మాచర్ల, నడికుడి రైల్వేస్టేషన్లను ప్రతిష్ఠాత్మకమైన అమృత్ భారత్ స్టేషన్ పథకం ఆధునికీకరణ చేపట్టాలని కోరారు.

రైతుబజారులో రాయితీపై కంది పప్పు, బియ్యం

● పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పుల్లారావు, కలెక్టర్ అరుణ్‌బాబు
● రైతు బజారులలో అందుబాటులో నిత్యావసరాలు

చిలకలూరిపేట, జూలై 11 : చిలకలూరిపేట రైతు బజారులో రాయితీపై కంది పప్పు, బియ్యం విక్రయాలను స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు, పల్నాడుజిల్లా కలెక్టర్ అరుణ్ బాబుతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ.180 ధర పలుకుతున్న కంది పప్పును రైతు బజారులో రూ.160 లకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. నిత్యవసర సరుకుల ధరలను దశలవారీగా తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే కంది పప్పు, బియ్యం విక్రయ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ధరల నియంత్రణ కోసం మిల్లర్లు, వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించామన్నారు. తొలి దశలో కంది పప్పుపై కిలోకు రూ.21 తగ్గించినట్టు తెలిపారు. ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం, కిలో కంది పప్పు ఇస్తారని తెలిపారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రారంభించిన ఈ విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే మాల్స్‌లతో పాటు ఇతర దుకాణాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నిత్యావసరాల విక్రయాలు జరపాలని కలెక్టర్ కోరారు.



వినియోగదారుడికి కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్

మనస్థాపంతో మహిళ ఆత్మహత్య

● అప్పు చెల్లింపులో బాధ్యత తీసుకోని భర్త
● పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ
● న్యాయం చేయలేదని పురుగు మందు తాగిన వైనం
● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు



శోభారాణి (ఫైల్)

బాపట్లరూరల్, జూలై 11: పోలీసులు తనకు న్యాయం చేయలేదంటూ ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెదుళ్ళపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి కొత్తపాలెం పంచాయతీ వడ్డెరపాలెం గ్రామానికి చెందిన బత్తుల శోభారాణి (30) అనే మహిళ కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన బత్తుల వెంకట్రావు అనే వ్యక్తితో 5 సంవత్సరాలు క్రితం వివాహమైంది. అయితే భార్యభర్తల మధ్య గొడవలు రావటంతో రెండేళ్ళ క్రితం శోభారాణి తన పుట్టింటికి వచ్చేసింది. అయితే వీరిద్దరు కలిసివున్న సమయంలో రూ.3 లక్షలు అప్పు తీసుకున్నారని, ఇప్పుడు ఆ అప్పుకు నాకు సంబంధం లేదని భర్త వెంకట్రావు అడ్డం తిరిగాడు. అయితే అప్పులు వాళ్ళు అతనిని పట్టుకొని అతని ఆటోను వెదుళ్ళపల్లి పోలీసులకు అప్పగించారు. భార్య శోభారాణియే తనను, ఆటోను పోలీసులకు పట్టించిందన్న కోపంతో భార్యపై అతడు కేసు పెట్టాడు. దీంతో శోభారాణి గ్రామంలోని పెద్ద మనుషులను తీసుకొని పోలీసుస్టేషన్‌కు వెళ్ళి మాట్లాడగా.. 'నీకు తప్పకుండా న్యాయం చేస్తాం' అని పోలీసులు తెలిపారు. అయితే పోలీసులు తన భర్తను, ఆటోను వదిలేయటంతో ఇదేంటని ఆమె పోలీసులను అడగగా సమాధానం లేకపోవడంతో మనస్థాపానికి గురై పురుగు మందు తాగింది. స్థానికులు వెంటనే బాపట్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా చికిత్సపొందుతూ ఆమె మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు శోభారాణికి పోలీసులు అన్యాయం చేశారంటూ రోడ్డుపై ధర్నా చేపట్టారు. బాపట్లరూరల్ సీఐలు హజరత్‌బాబు, శ్రీహరిలు కుటుంబ సభ్యులతో మాట్లాడి తప్పకుండా న్యాయంచేస్తామని హామినివ్వటంతో ధర్నాను విరమించుకున్నారు. ఈ ఘటనపై రూరల్ సీఐ హజరత్‌బాబును వివరణ కోరగా బత్తుల శోభారాణి, వెంకట్రావులు కలిసి ఉన్నప్పుడు రూ.3లక్షలు అప్పుచేశారని, అనంతరం వారు విడిపోవటంతో భర్త వెంకట్రావు అప్పుకట్టనని చెప్పగా అతను నడిపే ఆటోను అతడి భార్య వడ్డెరపాలెం తీసుకు వచ్చిందని, అయితే ఆ ఆటో వెంకట్రావుది కాకపోవటంతో ఆటో ఓనర్ వెదుళ్ళపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెదుళ్ళపల్లి పోలీసులు ఆటోను ఓనర్‌కు అందజేశారని, దీంతో ఆ మహిళ మనస్థాపానికి గురై పురుగు మందు తాగి మృతి చెందిందని సీఐ తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు పురుగు మందు తాగాడు..

● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి



శ్రీనివాసరావు మృతదేహం

ప్రత్తిపాడు, జూలై 11: మద్యానికి పూర్తిగా బానిసైన భర్తను తాగుడుమానుకోమని భార్య హెచ్చరించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన భర్త పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడులో జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన కోండ్రుపాడు గ్రామానికి చెందిన వల్లపు శ్రీనివాసరావు (32) తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతనికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే పూర్తిగా మద్యానికి బానిసైన భర్తను 'పిల్లలు పెద్ద వాళ్లు అవుతున్నారు.. ఇక తాగుడు మానుకోవాలి' అంటూ భార్య మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన శ్రీనివాసరావు గడ్డి మందు తాగాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు శ్రీనివాసరావును దగ్గరలోని కాటూరి వైద్య కళాశాల ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అనంతరం చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరిన ఎమ్మెల్యే ప్రవీణ్



ఆర్థిక మంత్రి పయ్యావులకేశవ్‌తో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జూలై 11 : పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక మంత్రిని ఎమ్మెల్యే ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పరిస్థితిని వివరించి, అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు భాష్యంప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయం, రోడ్లు, తాగునీటి పథకాల అమలుకి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరినట్టు తెలిపారు. నియోజక వర్గంలో కాలువ చివరి భూములు అధికంగా ఉన్నాయని, సాధ్యమైనన్ని ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయా సాగు భూములకు నీటిని అందించాల్సి ఉందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ అసమర్థపాలనలో విద్యుత్‌రంగం సంక్షోభంలో కూరుకు పోయిందని, సుమారు రూ.48వేల కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేసిన విద్యుత్ రంగ శ్వేతపత్రాన్ని పరిశీలిస్తే ప్రజలకు కళ్ళు చెదిరే నిజాలు తెలుస్తున్నాయని అన్నారు. గాడి తప్పిన వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషిచేస్తున్నారని, ఆయనకు ప్రజలందరూ సహకరించాల్సిన అవసరం ఉందని భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు.



కలెక్టర్ అరుణబాబు, ఎస్పీ మాలికగార్గ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొమ్మాలపాటి

పల్నాడును అగ్రగామిగా నిలబెట్టాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్
● కలెక్టర్, ఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు

నరసరావుపేట టౌన్, జూలై 11 : పల్నాడు అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీదర్ కోరారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పీ అరుణబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. కాగా అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మలిక గార్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ పల్నాడులో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు అసాంఘీక శక్తులను ఉక్కుపాదంతో అణిచివేయాలని ఎస్పీకి సూచించారు. జిల్లాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై కొమ్మాలపాటి వారితో చర్చించారు.



రోబోతో వీసీ నాగభూషణ్, విద్యార్థులు

రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు

● రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లా

గుంటూరు(విద్య), జూలై 11:భవిష్యత్తులో రోబోటిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లా తెలిపారు. చేబ్రోలు మండలం పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ (రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్) విభాగంలో 'రోబోకప్లర్స్ సెమి అండ్ హ్యూమనాయిడ్ రోబోట్ మ్యానుఫాక్చరింగ్ హబ్‌ను గురువారం ఘనంగా ప్రారం భించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రవీణ్ మల్లా మాట్లా డుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వాన్స్ రోబోటిక్స్ లేబొరేటరీతో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈహబ్ వలన విద్యార్థులతో పాటు పరిశోధనా అధ్యాపకులు రోబోట్‌లను రూపొందించడం, వాటిని అభివృద్ధి చేయడం మాత్రమే కాకుండా వాటి వాణిజ్యీకరణ కోసం మార్కెట్‌లోకి తీసుకెళ్లే అద్భుతమైన అవకాశం వస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

27,246 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 26,349 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 27,246 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 16,946 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16500	334	11000	15000
నెంబరు. 5	9000	15000	నెంబరు. 5	–	–
273	9500	11000	273	–	–
341	9000	17500	341	10000	15500
4884	12800	12800	4884	12000	14500
సూపర్ 10	15500	15500	సూపర్ 10	13200	13200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18500	తేజ	10000	18000
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9500	14000
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	8800	15000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	10000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పరామర్శ



చేతికి శస్త్ర చేయించుకొని గుంటూరులోని తన గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను గురువారం పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. - **సత్తెనపల్లి**

గొడవలో పెట్రోలు బాంబులు వాడలేదు

కారంపూడి, జూలై 11: మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామ శివారులోని మదీనా గార్డెన్ రెస్టారెంట్‌లో బుధవారం రాత్రి జరిగిన గొడవలో పెట్రోలు బాంబులు వాడలేదని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పాత గొడవల కారణంగా కొంత మంది వ్యక్తులు రెస్టారెంట్ వద్దకు వెళ్లి కొంత సామగ్రిని ధ్వంసం చేశారన్నారు. బాధితుడు 100కు ఫోన్ చేయడంతో ఎస్ఐ అమీర్ ఘటనా స్థలానికి చేరుకొని బాధ్యులను అదుపులోకి తీసుకున్నారన్నారు. అయితే ఘటన స్థలం వద్ద పెట్రోలు బాంబులు ఉపయోగించారని కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఇది అవాస్తవని స్పష్టం చేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించిన అనంతరం వచ్చిన నివేదిక ఆధారంగా వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వెట ఎస్ఐ అమీర్, సిబ్బంది ఉన్నారు.

రాయితీపై వరి, కంది విత్తనాలు పంపిణీ

రాజుపాలెం,జూలై11: మండలంలోని ఆకులగణపవరం గ్రామంలోని రైతు సేవా కేంద్రం ఆవరణలో గురువారం విత్తనోత్పత్తి(వరి), రాయితీపై కంది విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా ఏర్పాటు చేసిన సభలో స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ కుమారుడు గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు మాట్లాడుతూ మండలంలో వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండి సాగు విధానంపై రైతులకు సకాలంలో సూచనలు సలహాలు ఇవ్వాలని సూచించారు. పంట సాగుకు ముందుగానే ప్రతి రైతు వారి పొలంలో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు నర్రా మల్లయ్య, కూటమి నేతలు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, మర్రి వెంకట్రామిరెడ్డి, కొమటంనేని శ్రీను, చిన్నబోయిన రాఘవయాదవ్, రావిపాటి నాన్నయ్య, గుర్రాల జగన్, అంచుల నరసింహారావు, వర్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన బాధితులకు పరిహారం చెల్లించాలి

● జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు

క్రోసూరు, జూలై 11 : పెదకూరపాడు నియోజకవర్గంలో నకిలీ, నాణ్యత లేని విత్తనాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించక పోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు హెచ్చరించారు. గురువారం క్రోసూరులోని సంఘ కార్యాలయంలో నకిలీ విత్తన బాధిత రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఖరీఫ్ సీజన్‌లో అచ్చంపేట మండలం తాళ్ళచెరువు, పెరికపాడు, ఎర్రబాలెం, బయ్యవరం తదితర గ్రామాల్లో నకిలీవిత్తనాల వలన రైతులు నష్ట పోయారన్నారు. తాళ్ళచెరువు గ్రామంలో 100 మంది రైతులు 250 ఎకరాల్లో యూఎస్ 450 రకం మిర్చి పంట వేసి నష్టపోయారన్నారు. ఆయా రైతులకు ఎకరాకు రూ.1లక్ష వరకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కంపెనీ వారు పంటలను పరిశీలించి నష్ట పరిహారం చెల్లిస్తామని ఆరు నెలల క్రితం చెప్పినప్పటికీ ఇంత వరకు ఎటువంటి పరిహారం చెల్లించలేదని, అధికారులు కూడా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని రైతులు వాపోయారు. వెంటనే పరిహారం చెల్లించకపోతే ఆందోళన చేపడాతమని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం నేతలు ఆవుల ఆంజనేయులు, తిమ్మిశెట్టి హనుమంతరావు, కత్తుల గోపీకృష్ణారెడ్డి బాధిత రైతుల పక్షాన కిషోర్‌రెడ్డి, క్రస్నారెడ్డి, తిరుమలరెడ్డి, అశోక్‌రెడ్డి, రాయపరెడ్డి పాల్గొన్నారు.



దొడ్లేరులో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీలో వైద్యులు, సిబ్బంది

జనాభా నియంత్రణతోనే దేశం శుభిక్షం

● క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు

క్రోసూరు, జూలై 11 : దేశం అన్నివిధాలా శుభిక్షంగా ఉండాలంటే జనాభా నియంత్రణ ఒక్కటే మార్గమని క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు, డాక్టర్ సిరి చందన అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం దొడ్లేరు, క్రోసూరు గ్రామాల్లో జరిగిన ర్యాలీల్లో వారు పాల్గొన్నారు. డాక్టర్ ఇన్నారావు మాట్లాడుతూ.. కుటుంబ ప్రణాళిక అనేది అభివృద్ధి చెందిన భారతదేశానికి కొత్త గుర్తింపునిస్తుందన్నారు. తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం బిడ్డకు బిడ్డకు మధ్య కాలంలో అంతరం ఉండాలని, సరైన సమయంలో గర్భదారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రెండు గ్రామాల్లో జరిగిన ర్యాలీల్లో సీహెచ్‌వో జీ.సాంబశివరావు, సూపర్‌వైజర్ కేవీ శివుడు, ఏఎన్ఎం అనుపమ, భూలక్ష్మి, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ముప్పాళ్ళ, దమ్మాలపాడులలో ముప్పాళ్ళ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భదారణ జరిగితే మంచిదని, ఆరోగ్యవంతమైన పిల్లలు జన్మిస్తారని డాక్టర్ జయకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఏతః పీటర్ డామియేన్, జోస్ఫిన్ రాణి, సీహెచ్‌వో రహీమున్నీసా, ఏఎన్ఎంలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

రెంటచింతల : చిన్న కుటుంబమే చింతలేని కుటుంబమని పీహెచ్‌సీ డాక్టర్ రమాదేవి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం పీహెచ్‌సీ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ.. వివాహాల సంర్భంలో తగిన వయో పరిమితిని ఖచ్చితంగా పాటించాలని, కాన్పుకు కాన్పుకు మధ్య మూడు సంవత్సరాలు ఎడం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో ఆంజ నేయులు, శర్మ, సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న, నిర్మల, ఆరోగ్య కార్యకర్తలు ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

పెదకూరపాడు : ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారతదేశం అవతరించందని పెదకూరపాడు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకట రమణ అన్నారు. పెదకూరపాడులోని జెడ్పీ హైస్కూల్లో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ అత్యధిక జనాభాతో నిరుద్యోగం, పేదరికం, ఆహార సమస్య, శాంతి భద్రతలకు విఘాతం, నేరాల రేటు పెరిగిపోతుందన్నారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలు షేక్ రజియా మాట్లాడుతూ 1987లో ఒకక బిడ్డ జన్మించగానే జూలై 11న ప్రపంచ జనాభా ఐదు వందల కోట్లకు చేరిందని, ఈ నేపథ్యంలో ఐక్య రాజ్య సమితి జూలై 11ను ప్రపంచ జనాభా దినోత్సవంగా ప్రకటించిందన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యయే లక్ష్యం

దాచేపల్లి, జూలై 11: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం దాచేపల్లిలోని మోడల్ స్కూల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న పుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుతో పాటు మాజీ సర్పంచ్ తంగెళ్ల శ్రీనివాసరావు, టీడీపీ మండల కన్వీనర్ బద్రి, బొమ్మిరెడ్డి నారాయణ, మాజీ సర్పంచ్ వలి, పగడాల భాస్కరరావులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నేతల మృతికి సంతాపం

క్రోసూరు, జూలై 11 : మండలంలోని 88 తాళ్ళూరు, విప్పర్ల గ్రామాల్లో గురువారం మరణించిన ఎమ్మార్పీఎస్ నాయకుల మృతికి ఆయా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విప్పర్ల గ్రామంలో మరణించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ కారుడు కొమ్ము చిన వెంకయ్య మృతికి నియోజక వర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వేమవరపు జీవన్ సంతాపం వ్యక్తం చేశారు. వెంకయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. 88 తాళ్ళూరులో మృతి చెందిన ఘనుపల్లి ఏసయ్య మృతికి పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఏసయ్య 88 తాళ్ళూరు దళిత వాడ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని టీడీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ జీ. బలరామకృష్ణంరాజు, గ్రామ మాజీ సర్పంచ్ జీ.వాసుదేవ మహరాజు అన్నారు. ఏసయ్య మృతికి వైసీపీ నాయకులు రవి, రాజశేఖర్ తదితరులు సంతాపం వ్యక్తంచేస్తూ, ఆయన కుటుబీకులకు సానుభూతి తెలిపారు.

మత్స్యకారుడి మృతిపై పునర్ విచారణ

● గ్రామంలో అడిషనల్ ఎస్పీ రఘునాథరావు దర్యాప్తు



దుర్గారావు కుటుంబసభ్యులను విచారిస్తున్న ఏఎస్పీ రఘునాథరావు

వెల్దుర్తి, జూలై 11: మండలంలోని బంగారుపెంటకు చెందిన మత్స్యకారుడు చౌటుపల్లి దుర్గారావు మృతిపై పోలీసులు పునర్ విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా అడిషనల్ ఎస్పీ రఘునాథరావు గురువారం గ్రామానికి చేరుకొని దుర్గారావు భార్య ధనలక్ష్మీతో పాటు మరి కొందరిని విచారించారు. గత జనవరి 28న చేపల వేటకు వెళ్లిన దుర్గారావు అదే బోటులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అప్పట్లో సంచలనం రేపింది. పోలీసుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులతో పాటు అప్పటి టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి దుర్గారావు మృతదేహంతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి ఎస్ఐ శ్రీహరితోపాటు మరికొంతమంది పోలీసు సిబ్బంది స్టేషన్‌కు రమ్మని పిలవడం, డబ్బులు కోసం వేధించినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం ఉన్నతాధికారుల వద్ద కూడా అదే ప్రస్తావన వచ్చినట్లు తెలిసింది.

ప్రధానంగా దుర్గారావు ఆత్మహత్యకు చేసుకోవడం, ఉరివేసుకున్న తాడుపైనే పోలీసులు ఎక్కువగా ఆరా తీసినట్లు సమాచారం. జరిగింది జరిగినట్లు చెప్పి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని అధికారుల వద్ద విన్నవించుకున్నారు. ఏఎస్పీ రఘునాథరావు వెంట గురజాల డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాచేస్తున్న కుటుంబ సభ్యులు, బ్రహ్మనందరెడ్డి (ఫైల్)

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

రెంటచింతల, జూలై 11 : భారతీయ న్యాయవ్యవస్థలోని చట్టాలలో మార్పులు వచ్చాయని, ఈ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, జిల్లాచైల్డ్ ప్రొటెక్షన్ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మిట్టగుడిపాడు గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో మిషన్‌శక్తి భారతీయ న్యాయ సంహితపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లైంగికనేరాలు, స్త్రీలపై దాడులు, సామూహిక అత్యాచారం, వరకట్న వేధింపులు, వివాహ సంబంధిత నేరాలు గురించి బాలికలకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరస్పర దాడులు.. 24 మందిపై కేసు

రెంటచింతల, జూలై 11 : మండల కేంద్రమైన రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాన్యంలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణలో 24 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ ఎన్నికల సందర్భంలో నగదు పంపిణీ విషయమై ఏర్పడిన వివాదం డీ.నారపరెడ్డి, లూర్దుమేరీ వర్గీయుల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో పరస్పరం దాడులు చేసుకున్నారు. అనంతరం ఇరు వర్గీయులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

సత్తెనపల్లి, జూలై 11 : సత్తెనపల్లి నియోజకవర్గంలో అక్రమంగా ఎరువులు, పురుగు మందులు, నకిలీ విత్తనాల వ్యాపారాలు చేస్తున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బత్తుల ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. కొందరు వ్యాపారులు యథేచ్ఛగా కల్తీ మందులు, విత్తనాల అమ్మకాలను కొనసాగిస్తున్నారని, వారిపై సంబంధిత అధికారులు దృష్టిసారించి కఠిన చర్యలు తీసుకోవాలని, నకిలీల నుంచి రైతులను కాపాడాలని ఆయన కోరారు.

మొక్కుబడులు చెల్లింపు

సత్తెనపల్లి, జూలై11: టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు నాయుడు సీఎం కావాలని, సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ విజయం సాధించాలటూ టీడీపీ నేతలు ఎన్నికల ముందు మొక్కుకున్న నేపథ్యంలో గురువారం కడప అమీర్‌పీర్ దర్గాను సందర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సయ్యద్ పెద కరిముల్లా, ఫరీద్ బుడే, షేక్ ఆదాం షఫీ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రూ.20 వేలు ఇవ్వాలి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్

నకరికల్లు,జూలై 11: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా భూములు లేని కౌలు రైతులందరికీ రూ.20 వేలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నకరికల్లు, గుండ్లపల్లి, చేజర్ల, కుంకలగుంట గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. బ్యాంక్‌లు అర్హులైన కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలన్నారు. మండలంలో మిచాంగ్ తుఫాన్ వలన నాలుగు వందల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని, ప్రభుత్వం పంట నష్ట పరిహారాన్ని చెల్లించాలన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పటల రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈ.పిచ్చారావు, ఈపూరి లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు, కొండా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నర్సరీ లైసెన్స్ లేని వారికి నోటీసు అందిస్తున్న ఉద్యాన అధికారి శ్రీనిత్య

నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

పెదకూరపాడు, జూలై 11: నర్సరీ యజమానులందరూ కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఉద్యానశాఖ అధికారి తోటకూర శ్రీనిత్య సూచించారు. గురువారం మండలంలోని పరసలో నర్సరీలను ఆమె పరిశీలించారు. బెడ్‌ల మధ్యదూరం, ఎత్తులు సరిగ్గా ఉండాలని, నర్సరీ లోపల గడ్డి, కలుపు లేకుండా శుభ్రంగా ఉండేలా చూపుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నర్సరీ లైసెన్స్‌లు లేని వారికి నోటీసులు అందజేశామని, లైసెన్స్ లేని నర్సరీ యజమానులు దరఖాస్తు చేసుకోవాలని, ఉన్న వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ ఉద్యోగులు పలువురు పాల్గొన్నారు.

అపరిశుభ్రతతో అంటువ్యాధుల వ్యాప్తి

● నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు

దాచేపల్లి, జూలై 11: నివాస గృహాలు, చుట్టుపక్కల పరిసరాలలో ఏర్పడిన అపరిశుభ్రత తోనే అంటువ్యాధులు ప్రబలుతున్నాయని దాచేపల్లి మున్సిపల్ కమిషనర్ నారాయణరావు అన్నారు. గురువారం దాచేపల్లిలోని 10, 17 వార్డులలో ఆయన పర్యటించారు. నివాస గృహాలలో పాత టైర్లు, నీళ్లగాబులు, ఉపయోగపడని బకెట్లు వంటివాటిని నిల్వచేయడంతో వర్షపు నీరుచేరి దోమలకు నిలయంగా మారాయని తెలిపారు. వాటర్ ప్లాంట్‌లో నీటి నాణ్యత పరీక్షలు చేయాలని ఆదేశించారు. వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలను పాటించకపోతే ప్లాంట్లు మూసివేయడంతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటల్ నిర్వాహకులు శుచి, శుభ్రతను పాటించాలని, ఇష్టానుసారంగా లాభాలే ధ్యేయంగా ఉంటూ ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయా వార్డుల్లో ప్రతిరోజు పంచాయతీ కార్యదర్శి, ఎఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఆశ వర్కర్లతో ప్రత్యేక బృందాలను



వ్యర్థాలను తీసివేయాలని సూచిస్తున్న కమిషనర్ నారాయణరావు

ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య లోపంపై ఏమైనా లోపాలుంటే తక్షణమే సచివాలయ సిబ్బందికి, నగర పంచాయతీ కమిషనర్‌కు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తా చెదారం వేయడం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

పింఛన్‌లపై విచారణ చేపట్టాలి

ముప్పాళ్ళ, జూలై 11 :చాగంటివారిపాలెంలో వికలాంగ పింఛన్‌లు పొందుతున్న వారిపై విచారణ చేపట్టాలని గ్రామానికి చెందిన టీడీపీ నేత మదిర రామ్మోహన్‌రెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో కోరారు. గత ప్రభుత్వంలో గ్రామంలోని కొందరు వికలాంగులు కానప్పటికీ చదరమ్ సర్టిఫికెట్లు తీసుకువచ్చి వికలాంగ పింఛన్ పొందారని ఆరోపించారు. గ్రామంలోని 84 వరకు విలాంగ పింఛన్‌లు ఉన్నాయని, అందులో సగానికి పైగా వికలాంగులు కాని వారు పింఛన్‌లు పొందుతున్నారని ఆరోపించారు. గ్రామంలో వికలాంగ సర్టిఫికెట్లు ఇప్పించిన వారిపై విచారణ చేపట్టాలని, అసలైన లబ్ధిదారులకు పింఛన్‌లు అందేలాచూడాలని కోరారు. ఇంకా మరి కొంత మంది చదరమ్ సర్టిఫికెట్ తెచ్చుకొని వికలాంగ పింఛన్ పొందేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారని, వాటి పైనా విచారణ చేయాలన్నారు. సమావేశంలో గ్రామ టీడీపీ నాయకులు ఉన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో గందరగోళం

సత్తెనపల్లి, జూలై 11 : విద్యుత్ శాఖ నెలవారి బిల్లులు చెల్లింపుల్లో గందరగోళం నెలకుందని న్యాయవాది, సామాజిక కార్యకర్త నరిచేటి వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ శాఖ కొత్తగా ప్రవేశ పెట్టిన విధానంతో విద్యుత్ వినియోగ దారులు అయోమయంలో ఉన్నారన్నారు. గూగుల్‌పేలో విద్యుత్ బిల్లులు చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. విద్యుత్ బిల్లుల్లో చెల్లింపుల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ట్రాక్టరును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

● వ్యక్తికి తీవ్ర గాయాలు..సత్తెనపల్లి ఆస్పత్రికి తరలింపు

అచ్చంపేట, జూలై 11 : ఆగివున్న ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనంపై వస్తున్న రావిళ్ళ శ్రీకాంత్ అనే వ్యక్తి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రమైన అచ్చంపేటలోని దోసపాటి చెరువు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. మండలంలోని గ్రంధసిరి గ్రామానికి చెందిన రావిళ్ళ శ్రీకాంత్, బిక్కి. వెంకటేశ్వరరావులు ద్విచక్ర వాహనంపై కొత్తపల్లి వైపు నుంచి అచ్చంపేటకు వచ్చే క్రమంలో దోసపాటి చెరువు వద్ద ఆగి ఉన్న ఇసుక ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీ కొనటంతో ద్విచక్ర వాహనం పై వస్తున్న ఇరువురికి గాయాలు కాగా వీరిలో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా శ్రీకాంత్‌ను సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

పిడుగురాళ్ళ, జూలై 11: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం పిడుగురాళ్ల డిపోలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ సీనియర్ నాయకులు శివరాత్రి శ్రీను, ఎస్‌కె దస్తగిరి, వరప్రసాద్, బంగారు శ్రీను, అమీర్ అంజా, సుశీల, మరికొందరు కార్యక్రమంలో పాల్గొని యూనియన్ బలోపేతానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వారాహి గుప్త నవరాత్రి పూజల్లో పాల్గొన్న భక్తులు

ధూమ్రా వారాహిదేవిగా అమ్మవారు

నకరికల్లు, జూలై 11 : మండలంలోని కుంకలగుంటలో వేంచేసి ఉన్న భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారాహి గుప్త నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ధూమ్రా వారాహిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్కంఠ వీరభద్ర స్వామికి, కాశీ విశ్వేశ్వర స్వామికి విశేష అభిషేకాలుచేశారు. భద్రకాళి అమ్మవారికి జరిగిన కుంకుమపూజల్లో మహిళలు పాల్గొన్నారు. అర్చకులు మామిళ్ళపల్లి కాశీ విశ్వనాథ శాస్త్రి పూజలు నిర్వహించారు.

పశు గ్రాస విత్తనాల పంపిణీ

నకరికల్లు, జూలై 11 : ప్రభుత్వం 75 శాతం రాయితీపై అందజేస్తున్న పశు గ్రాస విత్తనాలు నకరికల్లు ప్రాంతీయ పశు వైద్యశాల, దేచవరం పశు వైద్యశాలలో అందుబాటులో ఉన్నట్టు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు బీ వెంకటేశ్వర్లు నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర రూ. 460 కాగా 75 సబ్సిడీ పోగా రూ.125 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక రైతుకు గరిష్ఠంగా 20 కిలోల పశు గ్రాస విత్తనాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకువచ్చి రైతు వాటా నగదు చెల్లించి పశుగ్రాస విత్తనాలు పొందవచ్చని వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటిని కలిసిన యమ్మాజీగూడెం గ్రామస్థులు

కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటా

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

● కార్యకర్త మృతికి సంక్షేమ నిధి నుంచి రూ. 2 లక్షలు అందజేత

బెల్లంకొండ, జూలై 11: టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటానని పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ భరోసా ఇచ్చారు. మండలంలోని యమ్మాజిగూడెం గ్రామానికి చెందిన ఇటీవల కాలంలో రామనబోయిన పెద అల్లయ్య ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబానికి కార్యకర్త సంక్షేమ నిధి నుంచి రూ.2 లక్షలను ఆర్థిక సాయం అందించారు. గురువారం గుంటూరులోని తన కార్యాలయంలో పెద్ద అల్లయ్య కుటుంబానికి కొమ్మాలపాటి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. పల్నాడు జిల్లాలో టీడీపీ కార్యకర్తలకు అన్ని వేళ్ళలా అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో యమ్మాజీగూడెం మాజీ సర్పంచ్ ఇక్కుర్తి పేరయ్య, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'బంగారం మాయం' సమస్యను పరిష్కరిస్తాం

క్రోసూరు, జూలై 11: దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో సంవత్సరం క్రితం అప్రైజర్ నాగార్జున నిర్వాకంతో మాయమైన బంగారం సమస్యను కొంతమేర పరిష్కరించినట్టు బ్యాంక్ మేనేజర్ శివశంకర్ గురువారం తెలియ జేశారు. ఈ విషయమై పలువురు బాధితులు గురువారం రైతు సంఘాల నేతలతో కలసి బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడారు. ఇంకా 80 మంది సమస్య పరిష్కారం కావాల్సి వుందని, వారి బంగారాన్ని కూడా ఇప్పించాలని బాధితులు కోరారు. బ్యాంకు మేనేజరు మాట్లాడుతూ.. రెండో విడత విచారణ చేపట్టామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, హనుమంత రావు, షేక్ రఫూఫ్, ఈశ్వరరెడ్డి, కళ్యాణి బాయి, భూలక్ష్మి, అనంత రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయపురిసౌత్ హైస్కూలు విద్యార్థి అజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హైస్కూలు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు

రాజుపాలెం,జూలై11: మండలంలోని ఆకులగణపవరం, ఇనిమెట్ల, అనుపాలెం గ్రామాలలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్లో గత సంవత్సరం 10వ తరగతి చదువుకున్న ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చినట్లు ఎంఈవో కేవీఎల్ నరసింహరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిదిలోని ఆకుల గణపవరం గ్రామానికి చెందిన నర్రా కుమార్, ఇనిమెట్లకు చెందిన ఎల్.సంజన, అనుపాలెంకు చెందిన టీసాయి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధిం చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఎంఈవోతో పాటు పలువురు అభినందించారు.

మాచవరం: మండలంలోని పిన్నెల్లి, మోర్జంపాడు జడ్పీ హైస్కూలు విద్యార్థులు ఆరుగురు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు. పిన్నెల్లి పాఠశాల నుంచి ఎస్‌కెఎండీ ఫరూక్ నూజివీడు ట్రిపుల్ ఐటీకి, ఎస్‌కేఎం జానీబాష ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, మోర్జంపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు కోట హారిక, గుండా యమునలు నూజివీడు ట్రిపుల్ ఐటీకి, వై. కృష్ణహరికరెడ్డి, గుణపాటి నవ్యలు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఎంఈవో శ్రీధర్, గ్రామస్థులు అభినందించారు.

మాచర్ల రూరల్ : మండలంలోని విజయపురిసౌత్ ప్రభుత్వోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసించిన నీలం అజయ్‌కుమార్ నూజివీడు క్యాంపస్‌లో ట్రిపుల్ ఐటీ సీటు సాధించాడు. ఈ సందర్భంగా గురువారం అజయ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమలో హెచ్ఎం కాంతారావు, ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొలం ఆన్‌లైన్ చేస్తామని డబ్బు తీసుకున్నారు

● గిరిజన రైతు హనుమానాయక్ ఆరోపణ

కారంపూడి, జూలై 11: 'నా పొలం ఆన్‌లైన్ చేయిస్తామని రెవెన్యూ అధికారులు డబ్బులు తీసుకొని పొలం ఆన్‌లైన్ చేయకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు.' అని కారంపూడితండాకు చెందిన గిరిజన రైతు హనుమానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కారంపూడిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్‌ను కోరానన్నారు. తహసీల్దార్ ఈ పనిని తన శిష్యుడు అయిన ఒప్పిచర్ల వీఆర్వో కోటేశ్వరరావుకు అప్పగించారని చెప్పారు. ఆ పొలాన్ని కారంపూడి, ఒప్పిచర్ల లాగిన్‌లో కాకుండా చినగార్లపాడు లాగిన్ నుంచి ఆన్‌లైన్ చేయాలని అందుకు డబ్బులు ఖర్చవుతాయని చెప్పి వీఆర్వో కోటేశ్వరరావు రూ. 3 లక్షలు అడిగారన్నారు. ఆ డబ్బులను తన స్నేహితుల ఫోన్‌పే నంబర్లకు ట్రాన్స్‌ఫర్ చేయాలని చెప్పారన్నారు. వీఆర్వో కోటేశ్వరరావు చెప్పిన విధంగా తాను డబ్బులు ట్రాన్స్‌పార్మర్ చేసినట్లు హనుమానాయక్ తెలిపారు. డబ్బులు తీసుకున్న తర్వాత పని చేయకుండా, తిరిగి డబ్బులు ఇవ్వ కుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఈ విషయంలో అధికారులు తనకు న్యాయం చేయాలని, లేకుంటే తనకు ఆత్మహత్యే శరణ్యమని హనుమానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో ప్రజలకు ఆవస్థలు

బెల్లంకొండ, జూలై 11 : విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం మూలంగా బెల్లంకొండ మండలంలోని విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి మరమ్మతులకు గురైనా విద్యుత్ పునరుద్ధరణకు విద్యుత్ శాఖ సిబ్బంది గంటల వ్యవధి తీసుకోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం 6 గంటలకు 33కేవీ విద్యుత్ బ్రేక్ డౌన్ అయిందని చెప్పి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఇవ్వక పోవటంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో విద్యుత్ శాఖలో పని చేసే అధికారులు సక్రమంగా లేరని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులకూ గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంటల వ్యవధి విద్యుత్ అంతరాయంతో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు పనిచేయక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల లోని వృద్ధులు, బాలింతలు, చిన్నారులు ఇళ్ళల్లో ఉండే అవకాశం లేకుండా పోతుందని వాపోతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి మండలంలో విద్యుత్‌శాఖ పనితీరుపై సమీక్షంచి తగిన చర్యలు తీసుకోవాలని వినియోగ దారులు కోరుతున్నారు.

పీఎం కిసాన్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

నకరికల్లు, జూలై 11 : పీఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్‌ను వెంటనే పూర్తి చేయాలని, మట్టి నమూనాల సేకరణను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ ఏడీఏ రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ పురోగతి, విలేజ్ యాక్షన్ ప్లాన్ గురించి ప్రతి రైతు సేవా కేంద్రాల వారీగా తయారు చేయాలన్నారు. ఆగస్టు 20వ తేదీ వరకు సాగర్ కుడి కాలువ నుంచి నీరు విడుదల కాని నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా కంది, సోయాబీన్స్, జొన్న సాగుకు సిద్ధంగా ఉండాలని పిడుగురాళ్ళ ఏడీఏ బీ.శ్రీకృష్ణ దేవరాయలు రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో కే దేవదాసు, అరుణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

స్టీల్‌ప్లాంట్‌పై నీలి మీడియాలో తప్పుడు కథనాలు

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 11: విశాఖ స్టీల్ ప్లాంట్‌పై తప్పుడు వార్తలు రాస్తూ రాజకీయ లబ్ధికోసం వేలాదిమంది కార్మికులను క్షోభకు గురిచేసిన నీలి పత్రికలపై చర్యలు తీసుకోవాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పూర్వ వైభవాన్ని తిరిగి పొందేలా ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విశాఖ బ్రాండ్ ఇమేజిని దెబ్బతీసేందుకు నీలిమీడియా యత్నిస్తోందని ఆయన మండిపడ్డారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసు గతంలో మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ పబ్లిక్ సెక్టార్‌లో కొనసాగించేలా కృషి చేస్తామని మాట్లాడితే, కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌పై యూటర్న్ తీసుకుందని నీలిమీడియా తప్పుడు వార్తలు రాయడం సరికాదన్నారు. అందరి మనోభావాలతో కూడుకున్న విశాఖ ఉక్కు ప్లాంట్‌పై దుష్ప్రచారం చెయ్యడం దుర దుష్టకరమన్నారు. ప్రజల్లో అభద్రతా భావాన్ని సృష్టించడం చట్ట విరుద్ధం అన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారంపై ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేద్దామనుకున్న జగన్ రెడ్డి ఇటువంటి వార్తలు తీసుకువస్తున్నారని ఆరోపించారు.



షేడ్‌నెట్‌లను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి నవీన్‌కుమార్

నర్సరీలకు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలి

● ఉద్యానవన శాఖ అధికారి నవీన్‌కుమార్

నరసరావుపేట రూరల్, జూలై 11: మండలంలోని లైసెన్సు లేని ప్రతి నర్సరీ యాజమాని వారం రోజుల్లో తప్పనిసరిగా లైసెన్స్ కోసం నమోదు చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని షేడ్‌నెట్ యజమానులందరూ దగ్గర్లోని రైతుసేవా కేంద్రాలలో అర్జీలను ఇచ్చి లైసెన్సు కోసం దరకాస్తు చేసుకోవాలన్నారు. అలాగే రైతులు ఎవరైతే విత్తనాలు తెచ్చుకుంటున్నారో వాళ్ళ దగ్గర విత్తనాలు తీసుకునేటప్పుడు వాళ్లు ఎక్కడ కొన్నారో సంబంధిత బిల్లు నకలను కూడా తీసుకోవాల్సిందిగా యాజమాన్యానికి సూచించారు. అలాగే ప్రతి షేడ్ నెట్ నర్సరీ యాజమాని తప్పనిసరిగా రిజిస్టర్‌లలో నమోదు చేయాలని, యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నర్సరీ లైసెన్స్ లేని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి దాసరి నవీన్ కుమార్, గ్రామ ఉద్యాన సహాయకులు ఆంజనేయులు, శ్రీకాంత్ రెడ్డి షాహిర్ నర్సరీ యజమానులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న
విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసరావు

విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

● ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసరావు

రొంపిచర్ల, జూలై 11: రొంపిచర్ల ఏడీఈ కార్యాలయం పరిధిలోని రొంపిచర్ల, శావల్యాపురం, ఈపూరు, నకరికల్లు మండలాల్లో విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసరావు గురువారం పేర్కొన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యుత్ బిల్లులను సకాలంలో వసూలు చేయాలని పేర్కొన్నారు. మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితగతిన ఏర్పాటుచేసేలా చూడాలన్నారు. రైతుల కోసం ఇచ్చే విద్యుత్‌ను సకాలంలో అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎకౌంట్ అధికారి కృష్ణారెడ్డి, డీఈఈ వెంకటేశ్వరరెడ్డి, ఆయా మండలాల ఏఈలు, విద్యుత్ రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫైరింగ్ పోటీల్లో ఎన్‌ఈసీ విద్యార్థికి రజత పతకం

నరసరావుపేట రూరల్, జూలై 11: ఫైరింగ్ పోటీల్లో ఎన్‌ఈసీ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థిని పీ గీతాసాయి శ్రీవల్లీ ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అనంతపురంలో రెండు తెలుగు రాష్ట్రాల టీఎస్‌సీ-ఐజీసీ నిర్వహణలో ఫైరింగ్ పోటీలు జరిగాయి. గీతా సాయి శ్రీవల్లీ గుంటూరు గ్రూపు నుంచి పోటీపడి మంచి ప్రతిభ కనబరిచిందన్నారు. ఈ సందర్భంగా గీతా సాయి శ్రీవల్లికి ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ కల్నల్ సంజయ్ గుప్తా రజత పతకం అందజేశారు.

నేడు అధికారుల సమావేశం

వినుకొండ టౌన్, జూలై 11: ఈ నెల 17 తేదీన జరిగే తొలి ఏకాదశి పండుగను సందర్భంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

చందవరం పాఠశాలలో నోటు పుస్తకాల పంపిణీ

నరసరావుపేట టౌన్, జూలై 11: నాదెండ్ల మండలం చందవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎస్సీ)లో ఉచితంగా నరసరావుపేట పట్టణం టైనీటాట్స్ డైరెక్టర్ వై.కోటయ్య గురువారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వై.కోటమ్మ మాట్లాడుతూ తమ సంస్థలో 50మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని చెప్పారు. విద్య ప్రతిభచూపిన వారికి ప్రతి గ్రామం నుంచి ఒకరికి ఉచిత విద్యను అందిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధచూపి ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహలతో పాటు టైనీటాట్స్ విద్యాసంస్థల సహకారం ఉంటుందని, వాటిని ఉపయోగించుకొని భవిష్యత్‌కు బంగారుబాట వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీఎల్‌పీడీ అన్నపూర్ణేశ్వరి, ఎస్కే మున్వర్ షరీఫ్, యూపీ పాఠశాల హెచ్‌ఎం పీ వీరయ్యచౌదరి, ఎల్‌ఈ పాఠశాల హెచ్‌ఎం బీ సతీష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీల్‌చైర్లు ఏర్పాటు చేయకుండా.. బిల్లుల కోసం ఒత్తిళ్లు

శావల్యాపురం, జూలై 11: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 500 పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు వచ్చే వృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక్కో వీల్‌చైర్ ఏర్పాటుచేయాలని, వాటికయ్యే ఖర్చును పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీల ఖాతాల్లో బిల్లులు పెట్టి చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీచేశారు. వీల్‌చైర్లు ఎక్కడ కొనుగోలు చేయాలో, వీల్‌చైర్ రేటును కూడా జిల్లా ఉన్నతాధికారులే ఖరారు చేశారు. ఒక్కో వీల్‌చైర్ ఖరీదు, రవాణా చార్జీలు, డెలివరీ చార్జీలతో కలిపి మొత్తం రూ.5049గా నిర్ణయించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వారే నేరుగా డెలివరీ చేస్తారని, ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాలని డీపీవో ఉత్తర్వుల్లో తెలిపారు. శావల్యాపురం మండలంలో మొత్తం 34పోలింగ్ కేంద్రాలుండగా వాటిలో 8పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. కానీ వీల్‌చైర్లను మాత్రం డెలివరీ ఇవ్వలేదు. వీల్‌చైర్లు ఇవ్వకుండా ఇప్పుడు బిల్లులు చెల్లించాలంటూ జిల్లా ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శులను ఒత్తిడి చేస్తుండడంతో వారికి ఏంచేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. విషయాన్ని సర్పంచ్‌ల దృష్టికి తీసుకెళ్ళగా వీల్‌చైర్లు ఇవ్వకుండానే బిల్లులెలా చెల్లిస్తామంటూ పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ఖర్చులకు ప్రభుత్వం విడుదల చేసే బడ్జెట్‌తో కొనాల్సిన వీల్‌చైర్లను పంచాయతీలకు ముడిపెట్టడమేంటని, వీల్‌చైర్లు ఇవ్వకుండా బిల్లులు చెల్లించమని అధికారులు ఒత్తిడి చేయడమేంటని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం భరించాల్సిన ఖర్చులను పంచాయతీలపై భారంమోపితే గ్రామాల్లో మౌలిక వసతులు ఎలా కల్పించాలని సర్పంచ్‌లు ప్రశ్నించారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రొంపిచర్ల, జూలై 11: మండలంలోని విప్పర్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు తుమ్మలచెరువు ఖాదర్‌బాషా తండ్రి వలి గురువారం మృతి చెందాడు. కాగా ఆయన మృతదేహాన్ని సందర్శించి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలిపి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, గెల్లి చిన కోటిరెడ్డి, పడాల హనిమిరెడ్డి, పొనుగోటి వెంకటరావు, మానుకొండ రామిరెడ్డి, జాగర్లమూడి వసంతరావు తదితరులు ఉన్నారు. అలాగే భుజానికి సర్జరీ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పచ్చవ రవీంద్రను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నవరంలో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు, బియ్యం

కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్, జూలై 11: పల్నాడు జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యం విక్రయించడం జరుగుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలోని రైస్ మిల్లర్లు, దాల్ మిల్లర్ల అధ్యక్షులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బియ్యం, కందిపప్పు ధరలు అధికంగా ఉన్నందున పేదవారికి నాణ్యత తగ్గకుండా సరసమైన ధరలకు అందించాలని సూచించారు. కందిపప్పు రూ.160, బియ్యం రూ.48, మరో రకం రూ.49 విక్రయించేలా సహకరించాలన్నారు. గురువారం నుంచి చిలకలూరిపేట, 12వ తేదీ శుక్రవారం నుంచి నరసరావుపేట, పిడుగురాళ్ళ పట్టణంలో ప్రత్యేక కౌంటర్లు ప్రారంభించడం జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నర్సరావుపేట రూరల్, జూలై 11: ప్రతి ఇంటికీ తాగునీరు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని యలమందల, కోటప్పకొండ వద్ద జలజీవన్ మిషన్ పనులకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. యలమందలలో రూ.39.80 లక్షలు, కోటప్పకొండలో రూ.3.93కోట్ల పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం తాగునీరు అందించే జలజీవన్ మిషన్ పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి విశ్వేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కడియాల రమేష్ బాబు, ఎర్రమాసు ఆంజనేయులు, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కడియాల తాండవ కృష్ణ, శివనాగు, సైదారావు, శివలక్ష్మయ్య, కుమారి, కపిలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



జలజీవన్ మిషన్ పథకం పనులకు శంకుస్థాపన చేస్తున్న
ఎమ్మెల్యే అరవిందబాబు

సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి నింపుతున్న అజిత్

జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 11: పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసి సింగ్ అజిత్‌కుమార్ స్ఫూర్తిని చాటారని, మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. గురువారం టీడీపీ యువ నాయకుడు, అజిత్ ఫౌండేషన్ చైర్మన్ సింగ్ అజిత్‌కుమార్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు క్యాంపు కార్యాలయంలో జన్మదిన కేక్‌ను ప్రత్తిపాటి కట్ చేసి అజిత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ యువత సేవా మార్గం అలవర్చుకోవాలని సూచించారు. అజిత్ చేపట్టిన సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. అనంతరం 35మంది యువకులు రక్తదానం చేశారు. పట్టణంలోని ప్రశాంతి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం, నిత్యావసర వస్తువులు అందజేశారు. గణపవరం తులసి వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. నాదెండ్ల మండలం కనపర్రు నైస్ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించటం పాటు సాయంత్రం అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు.



అజిత్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా, తేళ్ల సుబ్బారావు, బీమవరపు సుబ్బారావు, ఎస్ఎస్ సుభాని, కుల్లి చినబాబు, పిల్లి కోటి, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



నూజెండ్లలో కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

1318 మందికి కంటి వైద్య పరీక్షలు

నూజెండ్ల, జూలై 11: మండలం కేంద్రం నూజెండ్ల, వీ అప్పాపురం, పమిడిపాడు, మృతరాసుపాలెం, నాగిరెడ్డిపల్లి, చింతలచెరువు, మృత్యుంజాపురం గ్రామాల్లో గురువారం శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. 1318 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 351మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీరిని ఈ నెల 14వ తేదీ ఆదివారం వినుకొండ పట్టణంలోని జూనియర్ కళాశాలలో షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి పెదకాకాని శంకర్ కంటి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ జీవీ రమణారావు తెలిపారు. వైద్య శిబిరాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది, ఫౌండేషన్ ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు పేరు నమోదు చేసుకోవాలి

● ఐసీఐఎస్ సూపర్ వేజర్ శ్రీలత

వినుకొండ, జూలై 1: కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అందించే పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత తెలిపారు. పట్టణంలోని కొత్తపేట సచివాలయంలో పరిధిలోని మహిళల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ప్రసూతి ప్రయోజనాలను అందచేస్తుందని, ఈ పథకాలల్లో గర్భిణులకు ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం చాలా ముఖ్యమైనదన్నారు. లక్షల మంది గర్భిణులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారని, మొదటిసారి గర్భవతి అయిన ప్రతి మహిళకు రూ.5000 అందజేస్తున్నారన్నారు. దీనికోసం ప్రతి గర్భవతి పేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరమేశ్వరి, కార్యకర్తలు బి.నాగమని, ఉమాశంకరి, అరుణా, నిర్మల జ్యోతి, సునీత, ఉమామహేశ్వరి, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఈపూరు వీరేశ్వరాలయం భూముల కౌలు వేలం

ఈపూరు, జూలై 11: మండల కేంద్రమైన ఈపూరులోని వీరేశ్వరాలయం భూముల కౌలు వేలం గురువారం ఆలయ కార్య నిర్వహణాధికారి బీ శ్రీనివాసరావు నిర్వహించారు. రీసర్వే నంబరు 81లో 4.14 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహించగా రూ.86వేలకు పాడుకున్నారని ఈవో తెలిపారు. మునుపెన్నడు లేని విధంగా కౌలు వేలం ద్వారా అధిక ఆదాయం వచ్చిందని, ఈ ఆదాయంతో ఆలయ అభివృద్ధి చేయడం జరుగుతుందని శ్రీనివాసరావు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొల్లాపల్లి, జూలై 11: స్థానిక మండల కేంద్రమైన బొల్లాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీ, వివిధ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఆయా శాఖల అధికారులు సమావేశానికి నివేదికలతో రావాలన్నారు.

19మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

శావల్యాపురం, జూలై 11: మండలంలోని వేల్పూరు, పోట్లూరు, శావల్యాపురం జడ్పీ పాఠశాలలలోని 19మంది విద్యార్థులు ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు తెలిపారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన పొత్తూరి భువనసాయిసుభాష్, దూళ్ళ సంతోష్, అద్దంకి పవన్‌కుమార్, మర్రి యశోధర్, గోరంట్ల యామిని, బొల్లా అనుపమ, నన్నెబోయిన సాయి త్రిష, గాలం యశ్వంత్ బాజీ, బొల్లా వర్షిత, సగినాల వైష్ణవీలు, పోట్లూరు జడ్పీ పాఠశాలకు చెందిన చల్లా నందకిషోర్, గడిపూడి వెంకటదినేష్, గడిపూడి ఛత్రపతి మనోజ్, గొట్టిపాటి రథీశ్వర్, షేక్ మస్తాన్‌వలి, దావులూరి శ్రీలక్ష్మీలు, శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన కన్నెదారి వెంకటకళ్యాణ్, చెవల చంద్రశేఖర్, గొల్లపూడి అభినయవర్ధన్‌లు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు తెలిపారు. వీరికి నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో సీట్లు ఖరారైనట్లు తెలిపారు. ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులను ఎంఈవోలు సాంబశివరావు, లలితాకుమారి, హెచ్‌ఎంలు మహబూబ్ సుభానీ, అన్నపూర్ణమ్మ, విజయలక్ష్మి, పీఎంసీ చైర్మన్లు పల్లపాటి శ్రీనివాసరావు, గడిపూడి రామారావు, ముట్లూరి ప్రసాద్, విద్యావేత్త గడిపూడి వెంకట్రాయుడు తదితరులు అభినందించారు.

నేడు కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ శాఖ ప్రారంభం

చిలకలూరిపేట, జూలై 11: విశాఖపట్నం కేంద్రంగా ఉన్న కనక మహాలక్ష్మి కోపరేటివ్ బ్యాంక్ 30వ శాఖను చిలకలూరిపేటలో శుక్రవారం ఉదయం ఆర్‌వీఎస్, సీవీఎస్ హైస్కూల్ పక్కన ప్రారంభించనున్నట్లు ఆ బ్యాంక్ చైర్మన్ కే రాంబాబు గురువారం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా సహకార అధికారి పీ నారాయణస్వామి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌పై దాడి

వినుకొండ టౌన్, జూలై 11: ప్రైవేటు పాఠశాల యజమాని, ప్రిన్సిపాల్‌పై ఓవిద్యార్థి తండ్రి దాడిచేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. విష్ణుకుండినగర్‌లోని వాసవి పాఠశాల ప్రిన్సుపాల్ నాగోతు అనీల్ కుమార్‌పై అధిక ఫీజులు వస్తూన్నారంటూ బొట్లగుంట శ్రీనివాసరావు దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన ప్రిన్సిపాల్ అనీల్ వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు పిర్యాదు చేశాడు.



సమావేశంలో మాట్లాడుతున్న
విద్యుత్ శాఖ సీఆర్‌డీఏ సర్కిల్ ఎస్‌ఈ విజయ కుమార్

విద్యుత్ అంతరాయాలను జీరో స్థాయికి చేర్చాలి

● ఎస్‌ఈ విజయకుమార్

చిలకలూరిపేట, జూలై 11: విద్యుత్ సరఫరాలో ఇక మీదట ఎటువంటి అంతరాయలు లేకుండా జీరో స్థాయికి చేర్చాలని సీఆర్‌డీఏ సర్కిల్ విద్యుత్ శాఖ ఎస్‌ఈ డాక్టర్ పీ విజయకుమార్ గురువారం ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు, నిర్వాహణపై శాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో చిలకలూరిపేటలో ఆ శాఖ ఈఈ సీహెచ్ రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అన్ని స్థాయిల్లో ఉండాలన్నారు. ఓల్టేజీలో హెచ్చుతగ్గులు, అంతరాయాలు, లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తలెత్తే సాంకేతిక లోపాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. విద్యుత్‌లోడుకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఈ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఏడుగురు విద్యార్థులు

నాదెండ్ల, జూలై 11: మండలంలోని పలు పాఠశాలలకు ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. చిరుమామిళ్ళలోని నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన జెల్లి చెర్రి, పరిమళ్ళ జాన్ జోయల్‌లు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, గణపవరం భద్రాచలం ఉన్నత పాఠశాలకు చెందిన యమున నూజివీడులో, సోనాలి ఇడుపులపాయలో, మోడల్ పాఠశాలకు చెందిన షేక్ మొబీనా, డీ గాయత్రిలు ఒంగోలులో, సాతులూరు పాఠశాలకు బిట్ర ఆలేఖ్యలు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఝాన్సీవాణి, కృష్ణానాయక్, వెంకటరావు, ఎం సుందరరావు తదితరులు అభినందించారు.

● యడ్లపాడు: 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. మండలంలోని లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివి 580మార్కులు సాధించిన సయ్యద్ జావేద్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. కాగా అదే పాఠశాలలో చదివి 574 మార్కులు సాధించిన గాండ్ల సుశాంత్, జగ్గాపురం జగ్గాపురం జడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి చదివి 575 మార్కులు సాధించిన పి లక్ష్మీప్రియ ఒంగోలు ట్రిపుల్ ఐటిలో సీట్లు దక్కించుకున్నారు. విద్యార్థులను ఎంఈవో నాగరత్నం, లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వెంటరామిరెడ్డి, జగ్గాపురం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఉషశ్రీ, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్‌సీసీకి 52 మంది విద్యార్థుల ఎంపిక

నాదెండ్ల, జూలై 11: మండలంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక కోసం పరీక్ష నిర్వహించారు. హాజరైన 52 మంది విద్యార్థులు ఎంపిక కాగా వీరిలో బాలికలు 17 మంది, బాలురు 30 మంది ఉన్నారన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా తొలిసారి ఈ ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎన్‌సీసీ బెటాలియన్ సుబేదారు ఆర్ దేవరాజన్, హవల్దారులు జీ కృష్ణ, పీ కళ్యాణ్, బీ శ్రీనివాసులు, షేక్ సైదా, ఎన్‌సీసీ రెండో అధికారి మహమ్మద్ రసూల్‌లు పర్యవేక్షించారు.



గృహ నిర్మాణ శాఖ అధికారులతో ప్రత్తిపాటి సమీక్ష

పేదల ఇళ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే సమీక్ష

చిలకలూరిపేట అర్బన్, జూలై 11: మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నిర్వాకాలతో రాష్ట్రంలో పేదల ఇంటి కళ అస్తవ్యస్తంగా మారిందని, మాజీ మంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించిన గృహ నిర్మాణశాఖ అధికారులు డీఈ వెంకటేశ్వరరావు, మూడు మండలాల ఏఈలు, ఇతర అధికారులతో ప్రత్తిపాటి సమీక్ష నిర్వహించారు. అనంతరం పుల్లారావు మాట్లాడుతూ ఒక్క పేదవాడు కూడా సంతోషంగా లేకుండా ఐదు సంవత్సరాల పరిపాలన సాగించిన ఏకైక సైకో జగన్‌రెడ్డి అన్నారు. పాత వాసనలు, పద్ధతులన్నీ పక్కనబెట్టి రాష్ట్ర వ్యాప్తంగా పేదలందరికీ పక్కా ఇళ్ళు కట్టించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం అని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. నియోజకవర్గం మొత్తంలో ఉన్న అవసరమైన హౌసింగ్ లే అవుట్లతో పాటు నిధుల కేటాయింపుపై చర్చించారు. ఇప్పటికే మొదలు పెట్టి అసంతృప్తిగా ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సొంతింటి కల నెరవేర్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా లక్ష్యంచేరే వరకు అంతా కలసికట్టుగా పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు.



రోటరీ క్లబ్ సమావేశంలో పేద విద్యార్థులకు
నోట్ పుస్తకాలు బహూకరిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

పేదలను ఆదుకోవటంలోనే తృప్తి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూలై 11: పేదలను ఆదుకోవటంలో ఉండే తృప్తి ఆనందం, మరెందులోను లభించిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం నూతన కార్యవర్గ పదవీ స్వీకార సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా శరత్ కుమార్‌శాస్త్రి, కార్యదర్శి కొల్లా వెంకట సుబ్బారావు, కోశాధికారిగా జంపని శ్రీనివాసరావు పదవీ స్వీకారం చేశారు. కొత్త కార్యవర్గానికి పుల్లారావు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఆర్థికంగా స్థిరపడిన వారు ఆర్థికంగా వెనుకబడిన వారికి సాయపడే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. రోటరీ క్లబ్ కార్యక్రమాలకు తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పేద విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ కే శరత్‌చౌదరి, మాజీ గవర్నర్ ఏ రత్నప్రభాకర్, క్లబ్ సీనియర్ సభ్యులు ఎం.లింగయ్య చౌదరి, డీ శివనాగమనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ళ జయమ్మను సత్కరిస్తున్న చిత్రం

డాక్టర్ జయమ్మకు జాతీయ స్థాయి అవార్డు ప్రదానం

చిలకలూరిపేట, జూలై 11: స్థానిక మాజీ ఎమ్మెల్యే, ఒయాసిస్ సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మకు జాతీయస్థాయి అవార్డు లభించింది. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కమ్యూనిటీ సర్వీస్ అవార్డును ఢిల్లీలో రెండు రోజుల క్రితం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. ఈ అవార్డును అందుకున్న డాక్టర్ జయమ్మను ఒయాసిస్, రోటరీ క్లబ్, ఐఎంఏ సభ్యులు గురువారం అభినందించారు.



ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

చిలకలూరిపేట, జూలై 11: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గురువారం చిలకలూరిపేట డిపో ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని యూనియన్ కార్యదర్శి అద్దంకి వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కట్‌చేసి యూనియన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి, జెండా వదనం చేశారు. యూనియన్ స్థాపించిన నాటి నుంచి క్రమశిక్షణతో ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని సభ్యులకు సేవలను అందించామని ఈ సందర్భంగా వర ప్రసాదరావు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బీ కోటేశ్వరరావు, డిపో యూనియన్ ప్రెసిడెంట్ ఏఎస్‌రావు, సహాయ కార్యదర్శి ఎం.సుబ్బారావు, కేవీ రత్నం, సాంబిరెడ్డి, అంకారావు, ఎం.కమల, సైదావలి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఈయూ జెండాను ఆవిష్కరిస్తున్న నెల్లూరు జోన్
అసిస్టెంట్ సెక్రటరీ కె.హరిబాబు, ఇతర నాయకులు

వినుకొండలో...

వినుకొండ టౌన్, జూలై 11: వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఏపీ పీటీడీ (ఏపీఎస్ ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సం గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నెల్లూరు జోన్ అసిస్టెంట్ సెక్రటరీ కె.హరిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ఎంప్లాయీస్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంప్లాయీస్ యూనియన్ చేసిన కారుణ్య నియామకాలు, పేస్కేల్, జీతభత్యాలు వార్షిక ఇంక్రిమెంట్లు తదితర ఉద్యోగులకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడంలో యూనియన్ క్రియాశీలకంగా ఉంటుందని తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్కే ఖాజా మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి కృషిచేసిన రాష్ట్ర నాయకులను కొనియాడారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా నాయకులు టీఎస్‌రావు, యూనియన్ గ్యారేజి కార్యదర్శి గణపవరం శ్రీనివాసరావు, సీసీఎస్, డెలిగేట్ టీ .రాంబాబు, ఎస్కే జానీ, ఎస్కే బాజీ, ఎ.బ్రహ్మం, ఆంజనేయులు, అన్నపూర్ణ, టీ. సురేష్, ఎంఎం వలి, బి.పేరయ్య కేవీఎల్ నారాయణ, శివనాయక్, ఎస్ఎస్ఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.